పన్నెండేళ్ళ తర్వాత వారంతా హిమాలయాల సందర్శనకి వెళ్ళారు. వారికి అనుకోకుండా ఆ యువకుడి దర్శనం లభించింది. కౌపీనంతో, జడలు కట్టిన జుట్టుతో, అలౌకిక పారవశ్యంలో ఉన్న అతన్ని చూసి 'అయ్యో! బిచ్చగాడిలా అయిపోయావా?' అని అంతా ఏడవసాగారు.

"మీరంతా సంసారపు లంపటంలో కూరుకుపోయినందుకు మీగురించి నేను ఏడుస్తూంటాను." నిర్వికారంగా చెప్పాడా యోగి.

## 21. విమర్శకి ఆహ్వానం

ఓ మహాత్ముడికి పదునైన నాలుక గల మిత్రుడున్నాడు. నిత్యం ఆ మహాత్ముడ్ని ఏదో ఒక విషయంలో ఘాటుగా విమర్శిస్తూండటం అతని అలవాటు.

ఓ రోజు ఓ శిష్యుడు ఆ మహాత్ముడి దగ్గరకి వచ్చి చెప్పాడు.

"గురూజీ! మిమ్మల్ని ఘాటు మాటలతో హింసించే మీ మిత్రుడు ఇప్పుడే మరణించాడు."

"అయ్యో! ఎంత పని జరిగింది? నాలోని అహాన్ని అణచివేసే నా ఆధ్యాత్మిక మార్గదర్శి పోయాడా?" అంటూ ఆ మహాత్ముడు కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు.

సద్విమర్శ మనల్ని సరైన దారిలో పెడితే, కువిమర్శ మనలోని అహాన్ని అణచి సహనాన్ని పెంపొందిస్తుంది. కాబట్టి ఈ రెండూ ఆధ్యాత్మిక పథంలోనివారికి మేలైన మందులే.

## 22. పాఠం

వేదం నేర్చుకుని కాశీ నించి ఇంటికి ఓ పండితుడు తిరుగు ప్రయాణమయ్యాడు. దారిలోని ఓ ఊళ్ళో అతని దగ్గరకి ఓ పరిచారిక వచ్చి చెప్పింది.

"స్వామీ. మా అమ్మగారు మిమ్మల్ని రమ్మంటున్నారు."

ఎందుకోనని ఆ ఇంట్లోకి వెళ్ళిన అతనికి అది వేశ్యా గృహం అని అర్థమైంది. ఆమె వినమ్రంగా నమస్కరించి చెప్పింది.

"నాకు విద్వాంసులంటే ఎనలేని ప్రీతి. దయతో ఈ ఒక్కపూట నా ఆతిథ్యం స్వీకరించి నేనిచ్చే దక్షిణ తీసుకుని రాత్రికి వెళ్ళరు గాని."

అతను అట్టే సంకోచించలేదు. 'ఆమె చేతి వంట తింటున్న సంగతి తన ఊరివాళ్ళకి ఎన్నటికీ తెలీదు. పైగా దక్షిణ కూడా ముడుతుంది. అంతగా అయితే తర్వాత ప్రాయశ్చిత్త జపం చేసుకోవచ్చు' అనుకున్నాడు.

ఆమె వంట వండి అతని పాదాలు కడిగి వెండి కంచంలో అన్నం వడ్డించింది. అతను తినబోతూండగా ఆ పళ్ళెం లాక్కుంది. ఆశ్చర్యపోయిన అతనితో చెప్పింది.

"అయ్యా! మీరు కాశీలో నేర్చుకున్నది మీకు తిండి పెడుతుందేమో కాని, మోక్షాన్నివ్వదు. ఇతరులు తెచ్చే నీటినే తాకని సదాచారులైన మీరు వేశ్య వండిన భోజనం తినడానికి ఎందుకు సంసిద్ధులయ్యారో తెలుసా? నా వినమ్రతకి, నేనిచ్చే దక్షిణకి వ్యామోహం చెంది. నే చెప్పే పాఠం గుర్తుంచుకోండి. ప్రలోభ వ్యామోహాలే పాపానికి తల్లితండ్రులు. అవే మనల్ని మోక్షానికి దూరం చేసేవి. వాటిని దూరం చేయండి."

## 23. తగిన శిక్ష

ఓ అర్ధరాత్రి ధర్మగంట మోగడంతో ఓ రాజుగారికి మెలకువ వచ్చింది. దాన్ని ఎవరు కొట్టారో చూసి రమ్మని రాజు తన సేవకుడ్ని పంపాడు. కొద్దిసేపట్లో సేవకులు ఓ కుక్కని, సంకెళ్ళు వేసి బలవంతంగా ఓ తాగుబోతుని వెంటపెట్టుకుని వచ్చారు.

"నేను రోడ్డు పక్కన పడుక్కుని వుంటే, ఈ తాగుబోతు తన దారిన తను వెళ్ళక నన్ను రాళ్ళతో కొట్టి మరీ వెళ్ళాడు." ఫిర్యాదు చేసింది కుక్క.